క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, వీ-డెంటల్ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో దంత వ్యాధులు, సుగర్, బీపీ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సర్వసభ్య సమావేశం నేడు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు పార్కులోని వేములపలి కళాక్షేత్రంలో జరగనున్న ఈ కార్యక్రమానికి జీవితకాల సభ్యులుగా నమోదైన 914 మంది సభ్యులు గుర్తింపు కార్డులతో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఈ ఏడాది నిర్వహించిన సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కు అభివృద్ధికి తీసుకున్న చర్యలపై విస్తృత స్థాయి చర్చ నిర్వహించి, భవిష్యత్ ప్రణాళిక తయారు చేస్తామన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-4లో నూతన సామాజిక భవనాన్ని శనివారం కార్పొరేటర్ గంకల కవిత ప్రారంభించారు. సుమారు రూ.59 లక్షలతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించినట్లు ఈఈ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో కలిపి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేందుకు సామాజిక భవనం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం సామాజిక భవనంలో స్థానిక మహిళలతో కలిసి కార్పొరేటర్ గంకల కవిత, అప్పారావు దంపతులు సత్యనారాయణ స్వామి పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.

పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ



పేపర్ క్రాఫ్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంగుల కాగితాలతో వివిధ రకాల అలంకరణ వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జీఎస్ఎన్ మూర్తి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అంతరించిపోతున్న చేతి వృత్తుల ప్రాధాన్యాన్ని పిల్లలకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



లలితా పీఠంలో విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట: వైశాఖ మాసం శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితా పీఠంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ముందుగా స్వామి వారికి సుప్రభాత సేవ, సహస్రనామార్చన, విశేష హారతులిచ్చారు. 25వ తేదీ ఆదివారం ఉదయం అఘోర మృత్యుంజయ పాశుపత హోమం, అమావాస్య సందర్భంగా 27న ఉదయం 9.30 గంటలకు ప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తమ గోత్ర నామాలతో పూజలు చేసి స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

బాగుపడే దారేది..?

గ్రాండ్ సాక్షి రిపోర్ట్



కంచరపాలెం - తాటిచెట్లపాలెం రహదారిలో గోతులు

- అధికారంలోకి వస్తే రోడ్లు బాగుచేయిస్తామని కూటమి నేతల ప్రగల్భాలు
- గెలిచాక రహదారుల దుస్థితిని కన్నెత్తి చూడని పాలకులు
- 'ఉత్తర'లో కానరాని రోడ్ల మరమ్మతులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గోతులతో నెలల తరబడి వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిన్నచిన్న గోతులను జూమ్ చేసి బూతద్దంలో చూపించి రోడ్ల నిర్వహణపై దుష్ప్రచారం చేసిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక ఉగాది నాటికి గుంతలు పూడ్చివేస్తామని హామీ ఇచ్చారు. ఉగాది వెళ్లి రెండు నెలలు గడుస్తున్నా.. రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించలేదు. దీంతో అధ్వాన రహదారులపై అవస్థలు పడుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.



శ్రీనగర్‌లో అధ్వానంగా డే అండ్ నైట్ హాస్పిటల్ రోడ్డు



శ్రీనగర్‌లోని వీటీ స్కూల్ జంక్షన్‌లో రహదారి దుస్థితి



గోతులతో నిండిన రామాటాకీస్ జంక్షన్ - ద్వారకానగర్ రోడ్డు

సీతంపేట: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల రహదారులు గోతులతో నిండి దారుణంగా దర్శనమిస్తున్నాయి. రామాటాకీస్ నుంచి ద్వారకానగర్‌కు వెళ్లే శ్రీనగర్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రెడ్డి ఆస్పత్రి, డే అండ్ నైట్ ఆస్పత్రి రోడ్లు గోతులు పడి, పెచ్చులూడి మరమ్మతులకు గురయ్యాయి. బుల్లయ్య కళాశాల నుంచి ద్వారకానగర్ వెళ్లడానికి దగ్గర దారి కావడంతో ఈ రెండు మార్గాలను జనం ఆశ్రయిస్తుంటారు. ఈ రహదారులు సరిగ్గా లేక ప్రయాణ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. వీటీ హైస్కూల్ జంక్షన్‌లో రహదారి గోతులమయంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు.

వైఎస్ జగన్ హయాంలో అభివృద్ధి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆధునికీకరించిన కైలాసపురం రహదారి(ఫైల్)

సీతంపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అనేక ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఉత్తర నియోజకవర్గంలోని అనేక రహదారులను ఆధునికీకరించి అందంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలోని 17 వార్డుల్లో రహదారులను అభివృద్ధి చేశారు. ప్రతి వార్డులో సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు వెచ్చించి బీటీ రోడ్లు నిర్మించారు.

రహదారుల అభివృద్ధి, విస్తరణ..

- రూ.4 కోట్లతో మాధవధార బస్టాప్ నుంచి మారియట్ హోటల్ జంక్షన్ వరకు 1.75 కిలోమీటర్ల పొడవైన రహదారిని విస్తరణ, అభివృద్ధి చేశారు.
- ఊర్వశి కూడలి నుంచి న్యూ శ్రీనివాసనగర్ వరకు రూ.1.98 కోట్లతో 1.65 కిలోమీటర్ల నిడివి గల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.
- పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఎన్జీజీవోస్ కాలనీ వరకు 900 మీటర్ల నిడివి గల రోడ్డు విస్తరణ పనులు జరిపారు.
- సుమారు రూ.16.79 కోట్లతో 1.67 కిలోమీటర్ల నిడివి గల అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డును విస్తరించారు.
- సుమారు రూ.12.50 కోట్లతో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మారియట్ హోటల్ వరకు 1.70 కిలోమీటర్ల నిడివి గల రహదారిని 80 అడుగులుగా విస్తరించారు.
- నరసింహనగర్ మెయిన్ రోడ్ నుంచి మాధవధార బస్టాప్ వరకు 4.65 కిలోమీటర్ల పొడవైన రహదారిని 80 అడుగులకు విస్తరించారు.

గుంతలు పడి.. రాళ్లు తేలి..

కంచరపాలెం: కంచరపాలెం పరిధిలోని పలు రహదారులు గోతులమయంగా మారాయి. జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం నేతాజీ కూడలికి వెళ్లే మార్గంలోని బీటీ రోడ్లు రాళ్లు తేలాయి. అటు.. ఇటు భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు రాళ్లు తేలి గోతులు ఏర్పడుతున్నాయి. భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు పాదచారులకు రాళ్లు తగిలి గాయపడుతున్నారు. వర్షాలు పడేటప్పుడు గోతుల్లో వర్షపు చేరుతుండటంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నామని స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ (క్రైం) డి.లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై పోలీసులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జట్టి

ఎంవీపీకాలనీ: పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సూచించారు. ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో శనివారం పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రోజువారి విధుల ఒత్తిడిలో పోలీసులు ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాలతో కూడిన మితాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ దిశగా వారి కుటుంబ సభ్యులు సైతం సహకారం అందించాలన్నారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెడికవర్ హాస్పిటల్ సహకారంతో సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 750 మంది ఈ సేవలను వినియోగించుకున్నారన్నారు. గుండె, కిడ్నీ, మామోగ్రఫీ తదితర 13 రకాల పరీక్షలు మెడికర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన రుషిల్ డెకర్స్ సహకారంతో ఉచితంగా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, రుషిల్ డెకర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎ.కె.రాయ్, అదనపు ఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో సూర్య నమస్కారాలు



ఆర్కే బీచ్ వద్ద సూర్య నమస్కారాలు చేస్తున్న ట్యూషన్ పిల్లలు

డాబాగార్డెన్స్: పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు శనివారం ఉదయం ఆర్కే బీచ్ వద్ద ఆహ్లాదకర వాతావరణంలో సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం రుషికొండ బీచ్‌లో కూచిపూడి నృత్యంతో అభినయించారు. భక్తిశ్రద్ధలతో గాయత్రి హోమం నిర్వహించారు. రామ నామంతో సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ కూచిపూడి డ్యాన్స్, గాయత్రి హోమం కేవలం సంస్థ ఆవరణలోనే కాకుండా, ఇలా ప్రకృతి ఒడిలో ప్రకృతి మాత ఆశీస్సులతో విద్యార్థులు ఆనందంగా, మానసికోల్లాసంతో చక్కగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల కల్పనకు డిమాండ్

డాబాగార్డెన్స్: నూతనంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సరైన పరీక్షలు నిర్వహించకుండా మార్చడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని, తక్షణం ఆ ఇబ్బందులు తొలగించి పెన్షనర్లు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం డాబాగార్డెన్స్ వెల్నెస్ సెంటర్ వద్ద సీజీహెచ్ఎస్ సమస్యలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా దేశానికి సేవ చేసి, పదవీ విరమణ పొందిన పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలతో మోదీ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని ఆరోపించారు. గత ఏప్రిల్ నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందే విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత నెల వరకు ఎన్ఐసీ మాడ్యూల్లో అందిస్తున్న వైద్య సేవలను సిడాక్ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చారని, కొత్త మాడ్యూల్ సక్రమంగా పని చేయకపోవడం వల్ల దేశవ్యాప్తంగా వైద్య సేవలు పడకేశాయని తెలిపారు. సరైన చర్యలు చేపట్టకుండా ఇప్పుడు ఆకస్మాతుగా సాఫ్ట్‌వేర్ మార్పి వైద్య సేవలకు ఇబ్బంది కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రశేఖరరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన రోగులు లక్షలాది రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ శ్యామ్‌కిషోర్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, గతంతో పోలిస్తే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, త్వరలోనే మిగిలిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం జరుగుతుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామ్మకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంఆర్‌డీ రాజు, రామకృష్ణ, ఆర్. సత్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌రావు, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 12 ప్రముఖ కంపెనీల్లో 1,840 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ అర్హత గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా మెలోడి క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి, కళాంజలి, సరిగమప సంస్థల ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి జరిగింది. గాయనీ గాయకులు సిహెచ్.వి.సత్యనారాయణ, కె.వీరాస్వామి, వి.ప్రభాకర్, ఎం.పుండరీకుమార్, సత్యవతి, శ్రీదేవి, రంజిత, సుజాత ఎన్టీఆర్ నటించిన వివిధ తెలుగు చిత్రాల్లోని గీతాలు ఆలపించి అలరించారు. కార్యక్రమంలో భయ్యా శ్రీనివాస్, ఎం.వి.రాజశేఖర్, మస్తాన్‌రెడ్డి, అరుణకాంత్, చీరాల ఉష పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: వైశాఖ మాసం ఆఖరి శనివారం కావడంతో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో మామిడి పండ్లు సమర్పించుకున్నారు.



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

బుద్ధుని బోధనలతో ప్రపంచ శాంతి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: ప్రపంచ శాంతిని కాపాడటానికి బుద్ధుని బోధనలు నేటి తరానికి ఆదర్శమని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బుద్ధుని 2569వ జయంత్యుత్సవం సందర్భంగా ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'ప్రపంచ శాంతి – బుద్ధుని బోధనలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విలాసాల వైపు కాకుండా గౌతమ బుద్ధుని బోధనల వైపు దృష్టి మరల్చాలని సూచించారు. సమాజానికి హాని చేయకుండా ప్రజలు జీవించాలని హితవు పలికారు. ఐఏఆర్ఎఫ్ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాటూరి శ్రీనివాస్, ఆచార్య పెద్దయ్య, కేవీఎస్ మూర్తి, ప్రభు, పి.కె.జోష్, ప్రజ్ఞానంద, ఎస్.ఆర్.ఎల్.నరసింహారావు, చాట్ల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.

ఎర్నిమాంబ సన్నిధిలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతశర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ ప్రారంభించారు. సుమారు 6 వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎర్నిమాంబ అమ్మవారి మారువారం నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబా చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆయా గ్రామాల ప్రతినిధులు, సేవా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసిపూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

డాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ద్వారకాబస్ స్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, తొలగించిన రెండు వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్షంలో ఉంటూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్రమోదీ కాళ్లు మొక్కుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.